క్లుప్తంగా

పీజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని వినతి



ప్రిన్సిపాల్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ కళాశాలలో ప్రాధాన్యత కలిగిన పీజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఐదు వేల మంది చదువుతున్నారు. పీజీ చదివేందుకు వీరంతా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఏ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తే ఈ ప్రాంత విద్యార్థులకు మేలు చేకూరుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ ప్రిన్సిపాల్‌కు వివరించారు.

జోరుగా విద్యుత్ లైను పనులు



గుర్రంపేట రోడ్డులో విద్యుత్తు స్తంభాలకు తీగలు వేస్తున్న దృశ్యం

రోలుగుంట: మండలంలో బుచ్చింపేట నుంచి గుర్రంపేట మీదుగా వైద్యుత్ లైను ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ గ్రామాల రోడ్డులో విద్యుత్ లైను లేక రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆయా గ్రామాల సర్పంచులు ఉలబాల చంద్ర, గుములూరి బాబులు, ఎంపీటీసీలు ఉలబాల సత్యవతి, యర్రంశెట్టి కాంతమ్మ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుకు నివేదించారు. ఈ మేరకు విద్యుత్ లైను ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రహదారికి ఇరుపక్కలా అడ్డంకిగా ఉన్న చెట్లను, కొమ్మలను ఆ శాఖ అధికారులు నరికించి పాతిన స్తంభాలకు విద్యుత్ తీగలు వేస్తున్నారు. ఈ పనులు పర్యవేక్షించిన ఏఈ పద్మనాభం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆశ్రమంలో వృద్ధులకు భోజన వితరణ



వృద్ధులకు భోజన వితరణ చేసిన కొత్తకోట హెల్పింగ్ యూత్ సభ్యులు

రోలుగుంట: వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరులో నడుస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు రావికమతం మండలానికి చెందిన హెల్పింగ్ యూత్ సభ్యులు ఆదివారం భోజన ప్యాకెట్లను వితరణగా అందజేశారు. భిక్షాటన చేసేవారికిగానీ, తిండి దొరకని వారికి గాని ఆర్థిక సాయం చేయొద్దని, కడుపు నిండా తిండి పెట్టాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఆర్థిక సాయం కన్నా అన్నదానం మిన్న అనే భావంతో ఆశ్రమంలో 35 మంది వృద్ధులకు, కొత్తకోట, రోలుగుంట గ్రామాల్లో 300 మంది యాచకులకు భోజన ప్యాకెట్లు అందజేశామన్నారు. హెల్పింగ్ యూత్ సభ్యులను నిర్వాహకుడు యర్రంశెట్టి రాజారావు అభినందించారు.

చెత్త తరలింపు ట్రాక్టరు ప్రారంభం



చెత్త తరలింపు ట్రాక్టరును ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజీవిరావు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో చెత్త తరలింపు ట్రాక్టరును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చొరవతో గత ప్రభుత్వ హయాంలో ఈ ట్రాక్టరు మంజూరైంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల గతంలో ప్రారంభించలేదు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచడానికిగాను ట్రాక్టరును పంచాయతీకి సమకూర్చామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, చింతా వెంకటనారాయణమూర్తి, పడాల అప్పలనర్సయ్య, మండల యూత్ అధ్యక్షుడు కలిమి గోపాల్, పోతిన జగదీశ్, చిన్ని వెంకటరమణ, కలిమి గోసమ్మ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డివైడర్లు

- రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు
- కానరాని రేడియం స్టిక్కర్లు
- పట్టించుకోని అధికారులు



బోర్డులు లేకుండా ఉన్న డివైడర్లు



వారం రోజు క్రితం డివైడర్‌పైకి దూసుకుపోయిన టూరిస్టు బస్సు(ఫైల్)

మాకవరపాలెం: తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. ఎంతోమంది గాయాల పాలవుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడు. రోడ్డు మధ్యలో డివైడర్లకు రేడియం స్టిక్కర్లు హెచ్చరిక బోర్డులు లేక ఈ పరిస్థితి నెలకొంది. మాకవరపాలెం నుంచి తామరం జంక్షన్ వరకు రెండు కిలో మీటర్ల మేర నాలుగేళ్ల క్రితం కొత్తగా రోడ్డు నిర్మించారు. దీనికి మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేశారు. వీటికి హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు వేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా లారీలు, బస్సులు, కార్లు ఈ డివైడర్లపైకి దూసుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నాయి.

రాత్రయితే భయం భయం..

ఈ రోడ్డు మధ్యలో డివైడర్లకు ఇప్పటికీ హెచ్చరిక బోర్డులే కాకుండా, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ రాత్రి సమయాల్లో డివైడర్లు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నెలకు 15 నుంచి 20 వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు..

రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్‌కు డివైడర్లు కనిపించక పోవడంతో వాహనాలు వాటిపైకి దూసుకుపోతున్నాయి. గతంలో గ్యాస్ సిలిండర్ల లారీ సైతం తామరం జంక్షన్‌లో డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత అధికంగా కార్లు డివైడర్లపైకి దూసుకుపోయి ప్రమాదాలకు గురయ్యాయి. వారం రోజుల క్రితం అర్ధరాత్రి సుమారు 40 మంది ప్రయాణికులతో నర్సీపట్నం వెళుతున్న టూరిస్టు బస్సు మండల కేంద్రంలో డివైడర్‌ను ఢీకొట్టింది. అయితే వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా వీటి నివారణకు సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డివైడర్లకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాళ్లు తేలిన మట్టిరోడ్డుతో ఇక్కట్లు

మరమ్మతులు చేయాలని వాహనదారుల వినతి



రాళ్లు తేలిన దాలివలస కెనాల్ మార్గం



రాళ్లు తేలిన గవరపాలెం కెనాల్ మార్గం

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రైవాడ కెనాల్ మార్గంలో గ్రావెల్ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో రాళ్లు తేలి ఉండడంతో వాహనదారులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉగ్గినవలస, ఆర్.వై. అగ్రహారం, కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం, దాలివలస, రామచంద్రపురం, కె.కె.అగ్రహారం గ్రామాల్లో కెనాల్ గట్టుపై గ్రావెల్ రోడ్డు నిర్మించి 15 ఏళ్లు కావస్తోంది. ఈ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించడంతోపాటు, వర్షాలు పడే సమయంలో రోడ్డు పైభాగంలో గ్రావెల్ తొలగిపోయింది. దాంతో రోడ్డు అడుగు భాగంలో రాళ్లు బయటకు తేలాయి. రాళ్లు తేలిన రోడ్డును ఆనుకొని కెనాల్ నీటి ప్రవాహం ఉండటం వల్ల ఎప్పుడూ ఏ ప్రమాదం ఎదుర్కోవాల్సి వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాళ్లు తేలిన మార్గాన్ని జీవీఎంసీ అధికారులు మరమ్మతులు చేసి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా వంతెనల రక్షణ గోడలు



పెద్దిపాలెం వద్ద శిథిలమైన ఏలేరు కాలువ వంతెన రక్షణ గోడ

మాకవరపాలెం: శిథిలమైన వంతెన రక్షణ గోడలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని రామన్నపాలెం, పెద్దిపాలెం, లచ్చన్నపాలెం వద్ద ఏలేరు కాలువపై ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఏ మాత్రం అదుపు తప్పినా కాలువలో పడి ప్రాణాలు కోల్పోక తప్పదు. చాలాకాలంగా ఈ రక్షణ గోడలు ఇలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇటుగా పాఠశాలలకు, కళాశాలకు అధిక సంఖ్యలో విద్యార్థులు వెళుతుంటారని, ఏ సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఈ రక్షణ గోడలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

చీడపీడల నివారణకు జాగ్రత్తలు



పెసరపంటను ఆశించిన ఆకుపచ్చ పురుగు

రోలుగుంట: అపరాల పంటను ఆశించిన చీడపీడలపై ప్రారంభంలోనే తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి రైతులను కోరారు. గత నెల, ఈ నెల కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు చేసుకుని ఎన్నడూ లేని విధంగా మినప, పెసర, బొబ్బర తదితర అపరాల పంటల సాగు విస్తారంగా చేపట్టారు. రోలుగుంట, కొవ్వూరు, బుచ్చింపేట, గుర్రంపేట గ్రామాలను సందర్శించిన ఏవో ఈ పంటల్లో చీడపీడలను గుర్తించారు. ప్రధానంగా పెసర, మినపలో ఆకుపచ్చ తెగులును గుర్తించారు. ఈ సందర్భంగా రైతులకు చీడపీడలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. లీటరు నీటిలో 2.5 ఎం.ఎల్ క్లోరొపైర్‌పాస్ గాని, 1.5 ఎం.ఎల్ ఎసిపేట్‌ను మిశ్రమం చేసి పిచికారీ చేయాలన్నారు. ఈ విధమైన తెగులు ఆశించడం వల్ల ఏరు ద్వారా బాగా లోపలికి వ్యాపించి పక్క మొక్కలకు ఆశిస్తుందన్నారు. అందుకోసం వేర్లతో ఈ మొక్కలను పీకి దూర ప్రాంతాల్లో గొయ్యి తీసి పాతేయ్యాలన్నారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న ఈ పంటలకు వేపనూనె పిచికారీ చేసి సంరక్షించుకోవాలని సూచించారు. రైతుల చీడపీడలపై ఆందోళన చెందకుండా సమీప గ్రామస్థాయి వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు.



తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందడిగా మారాయి. అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, భర్నికం, పరవాడ, లంకెలపాలెం, సబ్బవరం, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఉత్సాహంగా గడిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.

అట్టహాసంగా కల్యాణ వేంకటేశ్వర స్వామి పెళ్లిరాట



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పెళ్లి రాట వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి పెళ్లి రాట వేశారు. స్వామివారి సన్నిధిలో వేదమంత్రోచ్ఛరణల మధ్య ఈ వేడుక జరిగింది. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, కమిటీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, కమిటీ సభ్యులు యల్లపు రాము, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



హెచ్ఎంతో పూర్వ విద్యార్థులు

చీడికాడ: మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారంగా టేబుల్ అందించినట్లు హెచ్ఎం రామకృష్ణ తెలిపారు. ఇక్కడ చదువుకున్న 2009–10 టెన్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో ఆనాడు తాము గడిపిన రోజులను గుర్తు చేసుకుని సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంతరం రూ.10 వేలు విలువ చేసే గ్లాస్ టేబుల్‌ను హెచ్ఎంకు అందించారు. ప్రతి ఏడాది తమకు తోచిన సహకారం పాఠశాలకు అందిస్తామన్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: ఉపాధి హామీ పథకం కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 చొప్పున వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని వెంకటాపురంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను ఆదివారం అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలు తమ సమస్యలను వెల్లడించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడవాలని చూస్తోందన్నారు. ఎంతో మంది పోరాటాల ఫలితంగా ఈ పథకం అమల్లోకి వచ్చిందన్నారు. పని చేసే ప్రాంతాల్లో కూలీలందరికీ సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా మోదమాంబ పండగ



కె.జె.పురంలో ఘటాలతో ఆలయానికి వెళ్తున్న ఆటో వర్కర్సు యూనియన్ కుటుంబ సభ్యులు



మోదమాంబ ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న యూనియన్ కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో స్థానిక మోదమాంబ ఆటో వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మోదమాంబ అమ్మవారి ఒడ్డు పండగ ఘనంగా నిర్వహించారు. ఏటా అమ్మవారి పండగను ఆటో వర్కర్సు యూనియన్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా 50 ఘటాలతో గ్రామ పురవీధులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక పూజలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం



గొల్లలపాలెంలో విద్యార్థుల వివరాలను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయిని వరలక్ష్మి



దాలివలసలో ప్రచారం చేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

కె.కోటపాడు: అంగన్‌వాడీలో ఐదేళ్లు పూర్తయిన చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. గొల్లలపాలెం, దాలివలస గ్రామాల్లో ఆదివారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వరలక్ష్మి, శ్రీనివాస్ చిన్నారుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఉచితంగా విద్యా కానుక కిట్లు ఇస్తున్నామని, చిన్నారులను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతన్నామని ఉపాధ్యాయిని వరలక్ష్మి తెలిపారు. చదువుతోపాటు ఆటల్లోను రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతీ కార్యక్రమం విద్యార్థులకు అందనున్నట్లు దాలివలస హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాకలోని సంతబయల గౌతమ పఠన మందిరం ఆధ్వర్యంలో వేసవిలో విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు స్థానికంగా అందుబాటులో ఉండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గౌతమ పఠన మందిర సభ్యులు అందిస్తున్న సేవలను కొనియాడారు. మందిర అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్య నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితులకు న్యాయం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పెదకలవలాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు డిమాండ్ చేశారు. ఆదివారం పెదకలవలాపల్లి గ్రామంలో నేవీ నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా రోజులుగా నేవీ ప్రహారీ నిర్మాణంతో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా నేవీ ప్రహారీ నిర్మాణంతో నష్టపోతున్న వారికి తగిన పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆలయ నిర్మాణం



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చూడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులపై కమిటీ సభ్యులు, పెద్దలు దృష్టి సారించాలన్నారు. అలాగే విరాళాల సేకరణ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరినీ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, జల్లేపల్లి వెంకట కృష్ణారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, ఆడారి దానకర్ణ, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలి



రమణమూర్తిని పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వెంకటాపురంలో ఇటీవల మెడ నొప్పికి శస్త్ర చికిత్స చేయించుకున్న మరిశా రమణమూర్తిని ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కొప్పిశెట్టి సత్యం, దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.